క్లుప్తంగా

జగజ్జననీ మాతకు పుట్టింటి పట్టుచీర



అమ్మవారి ఊరేగింపు నిర్వహిస్తున్న భక్తులు

నంద్యాల(వ్యవసాయం): పట్టణంలోని జగ్గనవీ నగర్‌లో వెలసిన జగజ్జననీ ఆలయంలో ఆషాఢ మాసాన్ని పురస్కరించుకొని ఆదివారం పట్టణ, వివిధ గ్రామాల నుంచి భక్తులు పుట్టింటి పట్టుచీర, సారెను భక్తిశ్రద్ధలతో సమర్పించారు. ఈ సందర్భంగా దుర్గా యూనిట్స్ ఫ్రెండ్స్ ఆధ్వర్యంలో అమ్మవారి మూలవిరాట్‌కు ఉదయాన్నే సుప్రభాతసేవ, పంచామృతాభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించి, ప్రత్యేకంగా అలంకరించారు. సామూహిక రాహుః కాల పూజలు జరిపించారు. భక్తులు అమ్మవారికి భక్తిశ్రద్ధలతో అమ్మవారికి మేళతాళాలతో గ్రామోత్సవాన్ని నిర్వహించి సారెను సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

గిట్టుబాటు ధర కల్పించాలి



కరపత్రాలను విడుదల చేస్తున్న నాయకులు

నంద్యాల(న్యూటౌన్): కేంద్రంలో మూడో సారి అధికారంలోకి వచ్చిన ఎన్‌డీఏ కూటమి ప్రభుత్వం దేశంలోని రైతాంగం పండించిన పంటలకు స్వామినాథన్ కమిషన్ సిఫార్సుల మేరకు మద్దతు ధర కల్పించాలని ఏఐకేఎంఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి నరసింహులు డిమాండ్ చేశారు. ఏఐకేఎస్ రాష్ట్ర జనరల్ కౌన్సిల్ సమావేశాన్ని జయప్రదం చేయాలని కోరుతూ ఆదివారం స్థానిక కార్యాలయంలో కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ కార్యదర్శి శంకర్, నరసింహులు మాట్లాడుతూ భవిష్యత్తు కార్యాచరణ రూపొందించేందుకు రాష్ట్రస్థాయి సమావేశాన్ని ఈనెల 20వ తేదీన కర్నూలు నగరంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో మదనగోపాల్, రమణయ్యశెట్టి, చౌడప్ప, అల్ల ప్రకాష్, ఆనంద్ పఠాన్ తదితరులు పాల్గొన్నారు.

జీఓ 117ను రద్దు చేయాలి

నంద్యాల(న్యూటౌన్): జీవో నం 117ను రద్దు చేసి ప్రాథమిక పాఠశాలలో 3, 4, 5 తరగతులను కొనసాగించాలని ఏపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి శివయ్య, రాష్ట్ర ఆడిట్ కన్వీనర్ భాస్కరరెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. ఆదివారం ముల్లాన్‌పేట ఉర్దూ ప్రాథమిక పాఠశాలలో జిల్లా అధ్యక్షుడు రామచంద్రారెడ్డి అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ తల్లికి వందనం పథకాన్ని కేవలం ప్రభుత్వ పాఠశాలలకు మాత్రమే వర్తింపజేసి, ప్రభుత్వ పాఠశాలల మనుగడను కాపాడాలన్నారు. మున్సిపల్ ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులు వెంటనే చేపట్టాలని తీర్మానించారు. పెరిగిన జనాభాకు అనుగుణంగా కొత్త పాఠశాలలు ఏర్పాటు చేసి ఖాళీలను భర్తీ చేయాలని, ఉర్దూ పాఠశాలల్లోను పోస్టులు భర్తీ చేయాలని కోరారు. సమావేశంలో తిమ్మారెడ్డి, రాజ్‌కుమార్, దస్తగిరిబాషా, రమేష్‌బాబు, రాములమ్మ, తదితరులు పాల్గొనానరు.

మూల పెద్దమ్మకు ప్రత్యేక పూజలు

దొర్నిపాడు: మండలంలోని డబ్ల్యూగోవిందిన్నె గ్రామంలో వెలసిన మూలపెద్దమ్మకు ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారిని దర్శించుకుని అభిషేకాలు, హారతులు పట్టారు. గాజులు, నిమ్మకాయలు, చీరలు, పిండివంటలు అమ్మవారికి సమర్పించి మొక్కులు చెల్లించారు. ఆలయ కమిటీ సభ్యులు తలారి శ్రీనివాసులు, శంకరయ్య, చిన్నపెద్దన్న, చిన్నన్నలు భక్తులకు అమ్మవారి తీర్థప్రసాదాలు అందజేశారు.

రక్తదానం.. ప్రాణదానం



రక్తదానం చేసిన వారిని అభినందిస్తున్న ఎస్‌ఐలు నగీన, వెంకట్‌రెడ్డి

ఆళ్లగడ్డ : రక్తదానం ప్రాణదానంతో సమానమని ఆళ్లగడ్డ పట్టణ ఎస్‌ఐలు నగీన, వెంకట్ రెడ్డి పేర్కొన్నారు. స్థానిక వైపీపీఎం ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో ఆదివారం ఆళ్లగడ్డ బ్లడ్ డోనర్స్ టీం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని వారు ప్రారంభించారు. రక్తదాతలను ఈ సందర్భంగా వారు అభినందించారు. కార్యక్రమంలో టీం సభ్యులు సుబ్బారెడ్డి, పరమేష్, బాబు, అబ్దుల్, జీలానీ, పవన్ కుమార్ పాల్గొన్నారు

10న మండల సర్వసభ్య సమావేశం

నంద్యాల(అర్బన్): ఈనెల 10న ఎంపీడీఓ కార్యాలయ సమావేశ భవనంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ సౌభాగ్యం ఆదివారం తెలిపారు. ఎంపీపీ ప్రభాకర్ అధ్యక్షతన జరిగే కార్యక్రమానికి ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, సంబంధిత శాఖల అధికారులు హాజరు కావాలన్నారు. గైర్హాజరైన అధికారుల వివరాలను సంబంధిత ఉన్నతాధికారులకు తెలియజేస్తామని హెచ్చరించారు.

ఆశ... నిరాశ!

- జూలై నెల కోటాలో బియ్యం మాత్రమే పంపిణీ
- జొన్నలు పంపిణీ చేస్తామంటూ ఆశ చూపిన వైనం



క్రిష్టిపాడులో బియ్యం మాత్రమే పంపిణీ చేస్తున్న దృశ్యం

దొర్నిపాడు: రేషన్ వినియోగదారుల ఆశలపై టీడీపీ ప్రభుత్వం నీళ్లు చల్లింది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం బియ్యం, గోధుమ పిండి, పంచదార, కందిపప్పు వంటినూనె తదితర నిత్యావసర సరుకులు అందజేసేది. ఆర్భాట హామీలు గుప్పించి అధికారం చేపట్టిన టీడీపీ ప్రభుత్వం వాటితో పాటు ఈనెల రాగిపిండి, జొన్నలు కూడా ఇస్తామంటూ ప్రజలకు ఆశలు రేకెత్తించింది. ఎండీయూ వాహనాల ద్వారా కార్డుదారులందరికీ బియ్యంతో పాటు మూడు కిలోల జొన్నలు ఇస్తామని ఉన్నతాధికారులు ప్రకటన కూడా వదిలారు. అయితే ఉన్న సరుకులకు సైతం కోతపెట్టి కేవవలం బియ్యం మాత్రమే పంపిణీ చేస్తూ ఒక్క సరుకుతో సరిపెట్టుకోవాల్సిందేనని చెప్పకేచెప్పారు అధికారులు. దీంతో పేదోళ్లు నిరాశకు గురవుతున్నారు. మండలంలో 8,476 రేషన్ కార్డులు ఉన్నాయి. కనీసం అరకిలో చెక్కర కూడా ఇవ్వకపోవడం ఏంటంటూ బిక్కముఖం వేశారు. జొన్నలు ఇస్తామని చెప్పి అవీ కూడా ఇవ్వలేదంటున్నారు. పల్లెవాసులు బియ్యం కంటె జొన్నలను అధికంగా ఇష్టపడతారు. పోనిలే రాగిపిండి ఇస్తారేమోనని ఎదురు చూసిన కార్డుదారులకు నిరాశే మిగిలింది. బహిరంగ మార్కెట్‌లో కందిపప్పు ధర మండిపోతుంది. కనీసం ఒక్క కిలో కంది పప్పు దొరికినా సరిపోతుందని ఆశపడ్డారు సామాన్యులు. టీడీపీ ప్రభుత్వ తీరుపై అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఆగస్టులోనైనా ఇచ్చిన హామీ మేరకు నిత్యావసర సరుకులు అందజేస్తారా.. లేదా అనే అనుమానం వ్యక్తం చేస్తున్నారు పేదోళ్లు.

రోటరీ, లయన్స్ క్లబ్ సేవలు ప్రశంసనీయం



మంత్రి ఫరూక్‌ను సన్మానిస్తున్న లయన్స్ క్లబ్ సభ్యులు

నంద్యాల(వ్యవసాయం): పట్టణంలో రోటరీ, లయన్స్‌క్లబ్ సేవలు ప్రశంసనీయమని మైనార్టీ, న్యాయ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ అన్నారు. ఆదివారం లయన్స్‌క్లబ్, రోటరీ క్లబ్‌ల 2024–25వ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమాలకు హాజరయ్యారు. లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యవర్గ ప్రమాణస్వీకారంలో మంత్రి ఫరూక్ మాట్లాడుతూ లయన్స్ క్లబ్ సభ్యులు సేవా దృక్పథం , అంకిత భావంతో నిస్వార్థంగా సేవలు అందిస్తున్నారని ప్రశంసించారు. ఆరోగ్య, రక్షణ, విద్యా, స్వయం ఉపాధి కార్యక్రమాలే ప్రధాన ధ్యేయంగా లయన్స్‌క్లబ్ పని చేయాలన్నారు. లయన్స్‌క్లబ్ నూతన అధ్యక్షుడిగా నిజాముద్దీన్, కార్యదర్శిగా సిరిగిరి రమేష్, కోశాధికారిగా మామిళ్ల నాగరాజు ప్రమాణస్వీకారం చేశారు. అనంతరం మంత్రిని క్లబ్ సభ్యులు సన్మానించారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ సభ్యులు ఆంజనేయులు, నాగరాజు, శ్రీకాంత్, రవిప్రకాష్, నాగమహేష్, రమణయ్య, తదితరులు పాల్గొన్నారు. అదే విధంగా స్థానిక రోటరీ కార్యాలయంలో నిర్వహించిన ప్రమాణ స్వీకార కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ రోటరీ సభ్యులు విద్యా, ఆరోగ్యాలపై అనేక సేవా కార్యక్రమాలను నిర్వహించి ప్రజల మన్ననలు పొందారన్నారు. రోటరీ క్లబ్ నూతన అధ్యక్షుడిగా ఎన్‌సీ మోహన్‌రెడ్డి, సెక్రటరీగా బాలకృష్ణ ప్రమాణస్వీకారం చేశారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ సభ్యులు పీడీజీలు రామలింగారెడ్డి, చిన్నపురెడ్డి, కందుకూరి శ్రీరామమూర్తి, దండె దస్తగిరి, నరేష్, తదితర రోటరీ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

ఒరిజినల్ సర్టిఫికెట్లు సమర్పించాలి

నంద్యాల(న్యూటౌన్): కాంట్రాక్ట్ అధ్యాపకులు రెన్యువల్ కోసం ఆర్‌జేడీ ఆదేశాల మేరకు ఒరిజినల్ సర్టిఫికెట్లను కళాశాలలో సమర్పించాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శశికళ ఒక ప్రకటనలో తెలిపారు. 2023–24 ఏడాదిలో పని చేసిన అధ్యాపకులు టెస్ట్, విద్యార్హత సర్టిఫికెట్లు తీసుకొని రెన్యువల్ కొరకు అంగీకార పత్రాన్ని సమర్పించాలని పేర్కొన్నారు. కాంట్రాక్ట్, రెగ్యులర్ ప్రక్రియ కొరకు ఈనెల 8లోగా ప్రిన్సిపాల్‌కు అందజేయాలన్నారు.

ముగ్గురిపై కేసు నమోదు

రుద్రవరం: మండల పరిధిలోని ఆలమూరు గ్రామానికి చెందిన బాధితుడు రఫీ ఫిర్యాదు మేరకు బయమ్మ, మాబుసా, నబిరసూల్‌పై కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ శోబన్‌బాబు ఆదివారం తెలిపారు. ఇంటి స్థలం విషయంలో వారి మధ్య మాటామాటా పెరిగి ఘర్షణ చోటు చేసుకుంది. ఈ ఘర్షణలో గాయపడిన రఫీ పోలీసులను ఆశ్రయించాడు.

గ్రామ పంచాయతీలకు చెత్త బుట్టల మంజూరు



ఎంపీడీఓ కార్యాలయానికి చేరుకున్న చెత్త బుట్టలు

నంద్యాల(అర్బన్): నంద్యాల మండలంలోని గ్రామ పంచాయతీలకు 20 వేల చెత్త బుట్టలు వచ్చాయని ఎంపీడీఓ సౌభాగ్యం తెలిపారు. స్వచ్ఛ భారత్ కార్యక్రమంలో భాగంగా 17 పంచాయతీలకు సంబంధించి ఇంటికి రెండు చొప్పున 20వేల చెత్త బుట్టలు రాగా, త్వరలో వాటిని పంచాయతీలకు అందజేస్తామన్నారు. గ్రామస్తులు వాటిని సద్వినియోగం చేసుకొని గ్రామాలను స్వచ్ఛ గ్రామాలుగా తీర్చిదిద్దుకోవాలన్నారు.

గంగాభవానీ ఆలయ వార్షికోత్సవం



బోనాలను ఊరేగింపుగా తీసుకెళ్తున్న మహిళలు

నంద్యాల(వ్యవసాయం): పట్టణ శివారులోని కుందూనది వద్ద వెలసిన శ్రీగంగాభవానీ దేవస్థానం 15వ ఆలయ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని పట్టణ రజక సంఘం ఆధ్వర్యంలో అమ్మవారికి భక్తిశ్రద్ధలతో మహిళలు పెద్ద ఎత్తున బోనాలను సమర్పించారు. ఈ సందర్భంగా అమ్మవారి మూలవిరాట్‌కు సుప్రభాతసేవ, పంచామృతాభిషకాలు, క్షీరాభిషేకం, ప్రత్యేక పూజలు జరిపించారు అమ్మవారిని పట్టువస్త్రాలతో అలంకరించి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. మహిళలు ఇంటి వద్ద నుండి బోనాలను వేపమండలతో అలంకరించుకొని మేళతాళాలతో ఆలయం వద్దకు ఊరేపింపుగా చేరుకొని అమ్మవారికి సమర్పించారు. ఆలయ నిర్వాహకులు భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు జిల్లెల్ల శ్రీరాములు, ఫయాజ్, న్యాయవాది తులసిరెడ్డి, బాలస్వామి, తదితరులు పాల్గొన్నారు.

తగ్గిన సాగు విస్తీర్ణం



ఇంజేడులో సాగు చేసిన మినుము పంట

ఉయ్యాలవాడ : మండలంలో ఖరీఫ్ సీజన్‌లో ఖరీఫ్ సాగు విస్తీర్ణం తగ్గింది. ఇప్పటి వరకు 138 హెక్టార్లలో రైతులు వివిధ పంటలు సాగు చేశారు. సాధారణ సాగు విస్తీర్ణం 2,725 హెక్టార్లు కాగా వర్షాలు జూన్ మాసంలో సమృద్ధిగా కురిశాయి. 67 ఎమ్ఎమ్‌కు గాను 175 ఎమ్ఎమ్ వర్షపాతం నమోదైంది. అయితే రైతులు పంటలు సాగు చేసేందుకు కావాల్సిన విత్తనాలు, ఎరువులు అందుబాటులో లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మండల పరిధిలో 11 రైతు సేవా కేంద్రాలు వుండగా ఇప్పటి వరకు విత్తనాలు, ఎరువులు మంజూరు కాలేదు. దీంతో అధిక ధరలు వెచ్చించి కొనుగోలు చేయాల్సిన పరిస్థితి నెలకొంది. ఉయ్యాలవాడ, ఇంజేడు, హరివరం, పుచ్చకాయలపల్లె, ఆర్.జంబులదిన్నె, సర్వాయిపల్లె, పెద్దయమ్మనూరు గ్రామాల్లో మొక్కజొన్న 74 హెక్టార్లు, మినుము 46, పత్తి 11, వేరుశనగ 5, బంతిపూలు 2 హెక్టార్లలో మాత్రమే సాగు చేశారు. కంది, వేరుశనగ, పెసర, సోయాబీన్, కొర్ర, ఆరుక వంటి చిరుధాన్యాలు సాగు చేసేందుకు విత్తనాలు అందుబాటులో లేవని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. విషయాన్ని ఏఓ రాజేంద్రకుమార్ దృష్టికి తీసుకెళ్లగా ఇప్పటి వరకు జీలుగ విత్తనాలు తప్పా ఇతర రకాల విత్తనాలు, ఎరువులు సరఫరా కాలేదన్నారు.

దుకాణాల ఏర్పాటుకు దరఖాస్తుల ఆహ్వానం

నంద్యాల(సెంట్రల్): మార్కెటింగ్ శాఖ ఆధ్వర్యంలో వెలుగోడులో నూతనంగా నిర్మించిన రైతు బజార్‌లో అద్దె ప్రాతిపదికన దుకాణాల ఏర్పాటుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా అగ్రి ట్రేడింగ్ మార్కెటింగ్ అధికారి అబ్దుల్ రహిమాన్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. మొత్తం 14 స్టాళ్లు, 2 షట్టర్ షాపులను నిబంధనల ప్రకారం కేటాయించనున్నట్లు పేర్కొన్నారు. డ్వాక్రా/ఎస్‌హెచ్‌జీ /గృహమిత్ర సంఘాలలో సభ్యులుగా ఉండి, ధ్రువపత్రాలు కలిగి ఉండాలన్నారు. దరఖాస్తులకు ఈనెల 15 వరకు గడువు ఉన్నట్లు తెలిపారు. మరిన్ని వివరాలకు వెలుగోడు రైతు బజారు కార్యాలయంలో ఉదయం 10 నుంచి 5 గంటల మధ్య సంప్రదించవచ్చన్నారు.

మొహర్రం వేడుకలు ప్రారంభం

- నెలవంక దర్శనంతో ప్రారంభమైన ముస్లింల నూతన సంవత్సరం
- నేడు కొలువుదీరనున్న పీర్లు
- మకానాలను ముస్తాబుచేసిన నిర్వాహకులు
- కులమతాలకు అతీతంగా ఉత్సవాలు



నెలవంక దర్శనంతో చాగలమర్రిలో గుండం తవ్వి వేడుకలను ప్రారంభిస్తున్న దృశ్యం



చాగలమర్రిలోని చిన్నమకానం వీధిలో మొహర్రం వేడుకలకు ముస్తాబైన శ్రీలాల్‌స్వామి మకానం

చాగలమర్రి: మండల కేంద్రమైన చాగలమర్రిలో ఆదివారం సాయంత్రం నెలవంక దర్శనంతో ముస్లింల హిజ్రి 1446 నూతన సంవత్సరంతో పాటు మొహర్రం వేడుకలు ప్రారంభమయ్యాయి. సోమవారం అర్ధరాత్రి స్వామిని భద్రపరచిన పెట్టెలను సాంప్రదాయ మేళతాళాలలతో ఊరేగింపుగా తీసుకొచ్చి శ్రీహజ్రత్ లాల్‌స్వామిని కొలువుదీర్చనున్నారు. మొహర్రం ముస్లిం క్యాలెండర్ ప్రకారం నూతన సంవత్సర ప్రారంభ నెల. అయితే ఈ నెల ప్రారంభంలోనే ఇస్లాం మత ప్రవక్త మహమ్మద్ రసూలుల్లా మనువళ్లు, వారి వంశస్తులు 72 మంది ఇస్లాం మత వ్యాప్తి కోసం కర్బలా మైదానంలో జరిగిన యుద్ధంలో వీర మరణం పొందారు. వారిని స్మరించడానికి ప్రతి ఏడాది మొహర్రం నెలలో 10 రోజులపాటు వేడుకలు నిర్వహించడం అనవాయితీగా మారింది.

10 రోజులపాటు ఉత్సవాలు..

ప్రతి ఏటా మొహర్రం పండుగను చాగలమర్రిలో లాల్‌స్వామి, ఇమాంహసేన్, ఇమాంహుసేన్, ఇమామే ఖాశీం, హురేషహీద్, అలీ అక్బర్(గుర్రం మీద పీరు)లను కొలువు దీర్చి 10 రోజుల పాటు భక్తులు స్వామిని దర్శించుకొని, ప్రత్యేక ఫాతెహాలు సమర్పించుకుంటారు. అలాగే ప్రత్యేక చదివింపులు, వారి కోరికలు నేరవేరినందుకు గాను భక్తులు పూల బాసికాలు, వెండి గోడుగులు, ఉయ్యాలలు, విలువైన చాదర్‌లు సమర్పించి మొక్కుబడులను తీర్చుకుంటారు. పండుగను గ్రామంలో కులమతాలకు అతీతంగా నిర్వహించి ప్రజలు మత సామరస్యాన్ని చాటుకుంటారు. గ్రామానికి చెందిన వారు వృత్తి రీత్యా సుదూర ప్రాంతాల్లో స్థిరపడినప్పటికీ మొహర్రం వేడుకలకు తప్పకుండా స్వగ్రామానికి విచ్చేసి, వేడుకల్లో పాలుపంచుకుంటారు. మొహర్రం పండుగకు చాగలమర్రి ప్రసిద్ధి. ఈ పండుగకు గ్రామంలో ప్రతి ఇల్లు బంధువులతో, స్నేహితులతో కళకళలాడుతాయి. గ్రామంలో పెద్దసరిగెత్తు, చిన్న సరిగెత్తు సందర్భంగా నిర్వహించే పీర్ల ఊరేగింపు కనుల విందుగా, భక్తికి మారుపేరుగా నిలుస్తుంది.

మహానందీశ్వరుడి సన్నిధిలో జిల్లా కలెక్టర్



మహానందీశ్వరుడి దర్శనార్థం వస్తున్న జిల్లా కలెక్టర్ రాజకుమారి



కలెక్టర్ రాజకుమారిని ఆశీర్వదిస్తున్న వేదపండితులు బ్రహ్మశ్రీ రవిశంకర్ అవధాని

మహానంది: మహానందీశ్వరుడి సన్నిధిలో నంద్యాల జిల్లా కలెక్టర్ రాజకుమారి దంపతులు పూజలు నిర్వహించారు. ఆదివారం సాయంత్రం అష్టవిధ మహామంగళ హారతుల సమయంలో దర్శనార్థం వచ్చిన వారికి ఆలయ ఏఈఓ ఓంకారం వెంకటేశ్వరుడు, వేదపండితులు రవిశంకర అవధాని ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా వారు శ్రీ కామేశ్వరీదేవి, శ్రీ మహానందీశ్వరస్వామి వార్లను దర్శించుకుని అభిషేకం, కుంకుమార్చన పూజలు నిర్వహించుకున్నారు. దర్శనం అనంతరం అలంకార మండపంలో కలెక్టర్ దంపతులకు వేద పండితులు స్వామి, అమ్మవారి ప్రసాదాలు అందించి ఆశీర్వచనాలు చేశారు.

నూతన కలెక్టర్‌కు మహానందీశ్వరుడి ప్రసాదాలు

నంద్యాల జిల్లా నూతన కలెక్టర్‌గా బాధ్యతగా స్వీకరించిన రాజకుమారి గణియాకు ఆదివారం వేదపండితులు మహానందీశ్వరుడి ఆశీస్సులు అందించారు. ఏఈఓ ఎర్రమల మధు, వేదపండితులు బ్రహ్మశ్రీ చెండూరి రవిశంకర్ అవధాని, ఉప ప్రధాన అర్చకులు మూలస్థానం శివశంకర శర్మ, హనుమంతశర్మ, రఘుశర్మలు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ రాజకుమారి గణియాను కలిసి స్వామి, అమ్మవారి ప్రసాదాలు అందించి వేదాశీర్వచనం చేశారు.


పర్యావరణాన్ని కాపాడుదాం




మొక్కలు నాటుతున్న మహిళా వైద్యులు

నంద్యాల(వ్యవసాయం): మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడాల్సిన బాధ్యత మనందరిపై ఉందని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ మహిళా విభాగం అధ్యక్ష కార్యదర్శులు డాక్టర్ కల్పన, సరిత అన్నారు. ఆదివారం పట్టణంలోని ఎస్‌బీఐ కాలనీ, చిన్నచెరువు కట్ట వద్ద మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. 200 మొక్కలను నాటారు. మొక్కలు పెంచడం ద్వారా పర్యావర కాలుష్యం నుంచి రక్షించుకోవచ్చని, చెట్లు ఎదిగేంత వరకు వాటి సంరక్షణ బాధ్యత తీసుకుంటామని చెప్పారు. డాక్టర్ రవికృష్ణ మాట్లాడుతూ వైద్యులు కేవలం ఆసుపత్రిలో వైద్యం అందించడమే కాకుండా సామాజిక వైద్యులుగా సేవా కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో విశ్రాంత విద్యుత్ ఇంజనీర్ పీరయ్య, వైద్యులు వసుధ, అనిల్‌కుమార్, విజయభాస్కర్, ఫణిల్‌కుమార్, నర్మద తదితరులు పాల్గొన్నారు.

రాజన్నకు చిత్రాంజలి




ప్రజల హృదయాల్లో రాజన్న



యోగ ముద్రలో రాజన్న

నంద్యాల(అర్బన్): మహానేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి జయంతిని పురస్కరించుకొని నంద్యాలకు చెందిన చిత్రకారుడు చింతలపల్లె కోటేష్ తాను వేసిన చిత్రకళలను ఆదివారం ప్రదర్శించారు. రాజన్న చిన్నతనం, పెళ్లి, రాజకీయ ఆరంగేట్రం, పేదల గుండెల్లో ఉండటం తదితరాలను చిత్రకళ ద్వారా చూపించారు.



బొటని వేలు గోరిపై రాజన్న చిత్రం



రావి ఆకుపై చిరునవ్వు చిందిస్తున్న వైఎస్సార్